క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, నాయకులు

తనకల్లు: కొక్కంటిక్రాస్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చెన్నూరి బాబు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణమ్మ, ఎంపీటీసీ హిమధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పూల నిర్మల మాజీ అగ్రీ బోర్డు అధ్యక్షుడు కొండా మల్లికార్జునలు బాబు మృతదేహంపై పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిపీరా, పూల శంకర్, ముస్తఫా, మురళీయాదవ్, మోహన్, గౌస్‌పీర్, కుళ్లాయప్ప, న్యూ స్టార్ జాఫరుల్లా, అబ్దుల్ రసూల్, ఇటుక వెంకటరమణ, అమీర్, బాబ్ జాన్, సదుం దస్తగిరి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

రైతులకు యూనిక్ ఐడీ తప్పనిసరి

తనకల్లు: రైతులకు యూనిక్ ఐడీ (విశిష్ట గుర్తింపు సంఖ్య) తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య గల ఐడీ కార్డు కచ్చితంగా ఉండాలని తెలిపారు. రైతు సేవ కేంద్రంలో వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలను సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తీసుకెళ్లి తమ విశిష్ట గుర్తింపు నంబర్ పొందాలని సూచించారు.

కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న వైద్యులు

తాడిమర్రి: కంటి ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులకు మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి అద్దాలు పంపిణీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కళ్లను రుద్దకుండా జాగ్రత్తగా ఒత్తుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ హరిత, కంటి వైద్యులు ఉరుకుందప్ప, ఎంపీహెచ్‌ఎస్ రాంకుమార్, జానకిరామ్, పిహెచ్‌ఎస్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఆటల పండుగ



పరుగు పందెంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ప్రతిభా వికలాంగుల సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం విభిన్న ప్రతిభావంతుల ఆటల పండుగను ఉత్సాహంగా సాగింది. చింతవనంలోని కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రొద్దం, రామగిరి, పెనుకొండ, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. వారికి కబడ్డీ, కుండ ఆట, వాలీబాల్, సంచులాట, మ్యూజికల్ చైర్స్‌తో పాటు పలురకాల ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు సంస్థ వ్యవస్థాపకులు మేరీ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సుకన్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠకుల నుంచి పన్నులు వసూలు చేయండి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

బత్తలపల్లి: గ్రంథాలయానికి వచ్చే పాఠకుల నుంచి పన్నులు వసూలు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ పేర్కొన్నారు. మంగళవారం బత్తలపల్లి శాఖ గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయానికి వస్తున్న వివిధ పత్రికలు, వార పత్రికలు, మేగజైన్లు, కాంపిటీషన్ పుస్తకాలు తదితర వాటి గురించి బత్తలపల్లి శాఖ గ్రంథాలయ అధికారి రాజేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీలు ప్రజలు నుంచి పన్నులు వసూలు చేస్తుంటాయని, అదే విధంగా పాఠకుల నుంచి కూడా పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు.

బ్రహ్మోత్సవ వైభవం

- భక్తులతో కిక్కిరిసిన ఆలయం
- రేపు ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం
- 80 చోట్ల అన్నదానాలకు ఏర్పాట్లు



నృసింహావతార నాటిక ప్రదర్శన

కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన బ్రహ్మ రథోత్సవం గురువారం జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే ఆలయ, పోలీస్, మున్సిపల్, ఇంకా పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులతో ఆలయం, పరిసర ప్రాంతాలు కిక్కిరిశాయి. ఆలయంలో అద్దె గదులు ఖాళీ లేకపోవడంతో భక్తులు నేలపైనే నిద్రిస్తున్నారు. లాడ్జీలలో సైతం గదులు ఖాళీ లేవనే సమాధానం ఎదురురవుతోందని భక్తులు అంటున్నారు. బ్రహ్మ రథోత్సవానికి గురువారం ఉదయం 7.45 నుంచి 8.20 గంటల మధ్య అనూరాధా నక్షత్రంలో శుభ మేష లగ్నమందు శుభ ముహూర్తంగా అర్చక పండితులు నిర్ణయించారు. రథం లాగేందుకు ఆనవాయితీగా వచ్చే కుటాగుళ్ళ, బేరిపల్లి, నాగిరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి, మూర్తిపల్లికి చెందిన భక్తులను నేరుగా వెళ్లి ఆహ్వానించి వచ్చామని ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రథోత్సవం నాడు పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల్లో అడుగడుగునా దాదాపు 80 చోట్ల అన్నదానం చేసేందుకు దాతలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



నృసింహాలయంలో భక్తుల రద్దీ

ట్రాఫిక్ మళ్లింపు

ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీఐ నారాయణరెడ్డి మీడియాతో పేర్కొన్నారు. పులివెందుల వైపు నుంచి బెంగళూరు వెళ్లాల్సిన వాహనాలు కొత్తగా నిర్మిస్తున్న కదిరి బైపాస్ గుండా వెళ్లవచ్చన్నారు. బెంగళూరు వైపు నుంచి కదిరి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే వాహనాలను హిందూపురం రోడ్డులోని వ్యవసాయ పరిశోధన స్థానం వరకు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. రథోత్సవం నాడు టవర్ క్లాక్ దాటి వచ్చేందుకు ద్విచక్ర వాహనాలకు కూడా అనుమతి లేదన్నారు. పట్టణంలో పలుచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తిరువీధుల్లోకి మాత్రం ఎలాంటి వాహనాలనూ అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



కన్వీనర్ రవికుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రణీత్‌రెడ్డి

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రణీత్‌రెడ్డి తెలిపారు. ఇటీవల నల్లచెరువు మండల కన్వీనర్‌గా నియమితులైన మొండెం రవికుమార్‌రెడ్డిని మంగళవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ప్రణీత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రణీత్‌రెడ్డిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. అనంతరం నూతన మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డిని పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రఫీ, ఆనంద్‌రెడ్డి, ఆదిమూర్తి, హైటెక్ రమణ, మాజీ సర్పంచ్ అక్బర్, వెంకటరెడ్డి, గోవిందురెడ్డి, సోమిరెడ్డి, బందార్లపల్లి లక్ష్మీపతి, చెన్నకేశవరెడ్డి, బాలకృష్ణ నాయక్, బషీర్, రమేష్ నాయక్, ఆంజనేయులు, రామాంజి నాయక్, ఖాదర్‌వలి, ఇర్ఫాన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు 'నో టచ్'పై అవగాహన కల్పించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీడీపీఓ



హాజరైన మహిళా పోలీసులు, కార్యదర్శులు

ధర్మవరం: పిల్లలకు 'నో టచ్' గురించి అవగాహన కల్పించాలని మహిళా పోలీసులను సీడీపీఓలు కవిత, లక్ష్మి సూచించారు. పిల్లలకు సంబంధించిన చట్టాల గురించి తెలియజేయాలన్నారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ సమితి, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పిల్లలు శారీరక, మానసిక ఉద్రేకం కలిగించే అంశాలు, బాలల న్యాయ చట్టం, బాల్యవివాహాల నిలుపుదలపై డివిజనల్ స్థాయి మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓలు మాట్లాడుతూ సచివాలయంలో పిల్లలు, మహిళలు ప్రశాంతంగా ఉండటానికి గ్రామాలలో పని చేయడానికి ఉన్న చట్టాల గురించి మహిళా పోలీసులు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా బాలికలు లైంగిక వేధింపులకు గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను తనిఖీ చేసి.. ఎవరైతే దుర్భరమైన పరిస్థితులలో ఉన్న పిల్లలు, ఒంటరి తల్లిదండ్రులు ఉన్న పిల్లలు, ఇబ్బందులకు గురయ్యే పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆ పిల్లలను లక్ష్యంగా చేసుకుని బాల్య వివాహాలు చేయడం, ట్రాప్ చేయడం వంటివి జరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ మహేష్, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండన్న, ప్రొటెక్షన్ ఆఫీసర్స్ నాగలక్ష్మి, మురళీధర్, సోషల్ వర్కర్ ఆనంద్, వనజాక్షి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న భానుడు



పుట్టపర్తిలో మధ్యాహ్నం వేళ బోసిపోయిన రహదారి

- బయటకు వచ్చేందుకు జంకుతున్న ప్రజలు
- పండ్లు, పానీయాలకు పెరిగిన డిమాండ్



పుట్టపర్తిలో టెంకాయ, జ్యూస్ బండ్లు

పుట్టపర్తి టౌన్: భానుడు భగ్గుమన్నాడు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. గత నాలుగు రోజులుగా 38 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే సూరీ సుర్రుమనిపిస్తుండటంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారు ఎండలో ఎక్కువసేపు తిరిగినా.. పని చేసినా నీరసించిపోతున్నారు. శరీరాన్ని చల్లబరచుకోవడానికి ప్రజలు చెరుకు రసం, కొబ్బరినీళ్లు తదితర పానీయాలతో పాటు కళింగర, దోస, తదితర పండ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేవారు ఎండ నుంచి రక్షణ పొందడానికి గొడుగు లేదా టోపీ లేదా తలపై గుడ్డ వేసుకోవాలని, తగినంత నీరు, చల్లని పానీయాలు తీసుకుంటూ ఉండాలని వైద్యులు శివకుమార్ సూచించారు.

మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం



జగనన్న కాలనీవాసులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పుట్టపర్తి టౌన్: జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ విమర్శించారు. మంగళవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో గల జగనన్న కాలనీలో సీపీఎం నాయకుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా అక్కడ నివాసం ఉంటున్న వారితో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు గత ప్రభుత్వం నాలుగు లే అవుట్లలో 3,400 ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలు పూర్తయిన వారు ఇళ్లల్లో చేరారన్నారు. అయితే ప్రస్తుతం ఈ కాలనీల్లో రోడ్లు, తాగునీటి సౌకర్యం, వీధిలైట్లు, డ్రైయినేజీలు నిర్మించడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంకా అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు జీఎల్ నరసింహులు, జంగాలపల్లి పెద్దన్న, జెడ్పీ శ్రీనివాసులు, దిల్షాద్, లక్ష్మీనారాయణ, పట్టణ కార్యదర్శి బ్యాళ్ల అంజి, కొత్తచెరువు కార్యాదర్శి ముత్యాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం



గ్రామ కమిటీ ఎంపిక నిర్వహిస్తున్న మండల కన్వీనర్ నాగరాజు

రామగిరి: వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయిలో బలోపేతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ మీసుగ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం కుంటిమద్ది గ్రామంలో కుంటిమద్ది పంచాయతీలోని శేషంపల్లి, సుద్దకుంటపల్లి శ్రేణులతో సమావేశమై గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కులం, మతం, ప్రాంతం, పార్టీలను చూడకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 9 నెలలైనప్పటికీ ఎన్నికల హామీలు నెరవేర్చలేకపోయారన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిద్దామన్నారు. నాయకులు మణికంఠ, బన్నెల నాగార్జున, ముకుంద, రఘువీర, పెద్దిరెడ్డి, వరదరాజులు, రామాంజనేయులు, నాగభూషణ, సుధాకర్, రాము, మీసాల రంగయ్య, బెస్త బద్రి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రం.. దుర్గంధభరితం



వీధిలో పేరుకుపోయిన చెత్త

కదిరి టౌన్: పట్టణంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు ఉన్నాయి. వలిసాబ్ రోడ్డు, కంచుకోట, అమీన్ నగర్, రాజేంద్ర ప్రసాద్‌వీధి, నల్లగుట్ట వీధి, జొన్నా వీధి, రైల్వే స్టేషన్‌రోడ్డు, రాజీవ్‌గాంధీ నగర్, జడలయ్యమఠం తదితర వీధుల్లోకి చెత్త తీసుకెళ్లే వాహనాలు రావడం లేదు. దీంతో ఆయా వీధులు చెత్తాచెదారంతో పేరుకుపోయాయి. రోజుల తరబడి అలానే ఉంటుండటంతో దుర్గంధభరితంగా మారాయి. కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగు ముందుకు వెళ్లడం లేదు. ఎక్కడికక్కడ రోడ్లపైకి మురుగు వస్తోంది.

చెత్త తీసుకెళ్లే వారేరీ?



పలు వార్డుల్లో చెత్త చెదారం పేరుకుపోయింది. 15 రోజుల నుంచి వాహనాలు రాకపోడంతో ఇంటిలోనే చెత్తపెట్టుకుంటున్నాం. అధికారులు స్పందించి చెత్తను తొలగింపునకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

–జీఎల్ నరసింహులు, కదిరి

22న బహిరంగ వేలం

ధర్మవరం: ధర్మవరం పురపాలక సంఘం పరిధిలో 2025–26 సంవత్సరానికి దిన, వారపు మార్కెట్, జంతువధ శాలల సుంకం వసూలుకు ఈ నెల 22న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో రెండుసార్లు అనివార్య కారణాల వల్ల వేలం వాయిదా పడిందని తెలిపారు. 22న నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

రేపు విద్యుత్ అంతరాయం

కదిరి టౌన్: ఖాద్రీశుని బ్రహ్మ రథోత్సవం సందర్భంగా గురువారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కదిరి విద్యుత్ ఈఈ జె.మోసెస్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో పూల బజారు, అయ్యప్పస్వామి ఆలయం, దేవళం బజారు, వాసవి నగర్, వలిసాబ్ రోడ్డు, ఆలంఖాన్ వీధి, ఇక్బాల్ రోడ్డు, జౌకుపాళ్యం, నల్లగుట్ట వీధి, మారుతీనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. బుధవారం రాత్రికి వాటర్ ట్యాంకులు నింపుకోవాలని సూచించారు.

ఇఫ్తార్ విందుతో పుణ్యం



ఇఫ్తారు విందును ఆరగిస్తున్న ముస్లింలు

బత్తలపల్లి: రంజాన్ మాసంలో ముస్లింలకిచ్చే ఇఫ్తార్ విందుతో ఎంతో పుణ్యం లభిస్తుందని బేల్దారి సంఘం నాయకులు మంజుల నాగేష్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మదీనా, జామియా మసీదుల్లో ముస్లింలకు ఇఫ్తార్ విందును మంజుల నాగేష్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ఇచ్చారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ముస్లింలు ఎంతో కఠోర దీక్షతో వేకువజాము నుంచి సాయంత్రం వరకు ఉపవాసముంటారని పేర్కొన్నారు. రంజాన్ మాసం కులమతాలకు అతీతంగా సోదరభావం పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో ముతవల్లి సులేమాన్, మాజీ ముతవల్లి కరీంసాబ్, ఎల్ఎస్ సుబహాన్, చాంద్‌బాషా, ముబారక్, టైలర్ రఫీ, ఇస్మాయిల్, మదీనా మౌలా, కార్పెంటర్ అహ్మద్, ఎన్పిటి ఖాశీంవలి, ఫొటో స్టూడియో పఠాన్ తాసిన్, ఎల్జి ముబారక్, జాఫర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న మీటర్ రీడర్స్

పుట్టపర్తి టౌన్: విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో పుట్టపర్తి డివిజన్ మీటర్ రీడర్స్ నాయకులు డీఈ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థను నమ్ముకొని 15 సంతత్సరాలుగా మీటర్ రీడర్లుగా పనిచేస్తున్నామన్నారు. స్మార్ట్ మీటర్లు వస్తే మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం డీఈ శివరాంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మీటర్ రీడర్స్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా కోశాధికారి దస్తగిరి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు వినోద్, మీటర్ రీడర్స్ రవి, నాగేష్ నాయక్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ పోలప్ప మంగళవారం ప్రారంభించారు. వేసవిలో చల్లని తాగునీరు ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

సీసీ కెమెరాలు అమర్చుకోండి



దుకాణదారులకు సూచనలు ఇస్తున్న సీఐ శివరాముడు

ముదిగుబ్బ: దుకాణాల వద్ద సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సీఐ శివరాముడు సూచించారు. మంగళవారం ఆయన ముదిగుబ్బలోని దుకాణదారులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలు జరిగినప్పుడు నిందితులను పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కొత్త వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

గృహ నిర్మాణాలపై సమావేశం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గృహ నిర్మాణాలపై లబ్ధిదారులతో తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇటీవల గృహ నిర్మాణాల పూర్తి కోసం ప్రకటించిన అదనపు లబ్ధి గురించి వివరించారు. నూతన గృహాల కోసం పట్టా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సత్వరం జారీ చేస్తామని పేర్కొన్నారు.